## క్లుప్తంగా

### నేడు నందిగామలో జగనన్న సురక్ష కార్యక్రమం

**నందిగామ:** పట్టణంలోని 10 వ నంబరు సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ కార్యక్రమం సచివాలయ సమీపంలోని వజినేపల్లి గార్డెన్స్‌లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు.

**నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష**

**జగ్గయ్యపేట:** మండలంలోని ధర్మవరప్పాడు తండా, షేర్‌మహ్మద్‌పేట-2 సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షేర్ మహ్మద్‌పేట క్యాంపులో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొంటారని పేర్కొన్నారు.

### మునేటికి వరదనీరు



**లింగాల(వత్సవాయి):** మునేటికి ఎగువ ప్రాంతాలైన వరంగల్, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు పడుతుండడంతో మునేటికి వరదనీరు చేరుతోంది. మునేటికి సోమవారం 4883 క్యూసెక్కులు నీరు వస్తుండగా, 4662 క్యూసెక్కుల వరదనీటిని విడుదల చేశారు. 261 క్యూసెక్కుల నీటిని మునేటి కాలువ ద్వారా విడుదల చేశారు. 9 అడుగుల మేర వరద వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరదనీటిని దృష్టిలో ఉంచుకుని లింగాల కాజ్‌వే వద్ద రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

### ఆటో డ్రైవర్లకు లైసెన్స్ తప్పనిసరి



**పెనుగంచిప్రోలు:** ఆటో డ్రైవర్లు తప్పకుండా లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్‌ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోల్లో నిబంధనల ప్రకారం ప్రయాణికులను ఎక్కించాలన్నారు. డ్రైవర్లు ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. అతివేగంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

### గ్రంథాలయ పితామహుడికి ఘన నివాళి



**కొణకంచి(పెనుగంచిప్రోలు):** స్థానిక బాలభక్త శాఖా గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి ఎ.రామచంద్రుడు మాట్లాడుతూ గ్రంథాలయోద్యమ పితామహుడిగా పేరొందిన వెంకట రమణయ్య గ్రంథాలయ సర్వస్వం అనే పత్రికను నిర్వహించారన్నారు. ఆయన ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో కూడా సిద్ధహస్తులన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నార్ని వెంకటేశ్వర్లు, గూడెపు రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



**ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట):** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించాలని ఎంఈవో చిట్టిబాబు అన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డిజిటల్ విద్యతో పాటు ఆంగ్ల మాధ్యమం బోధన అందిస్తున్నట్లు తెలిపారు. అందుకనుగుణంగా ఉపాధ్యాయులు వారికి అర్థమయ్యే రీతిలో బోధించటమే కాకుండా ఉన్నతస్థాయికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు హనుమంతరావు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ తావుడియా, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువైన పాలన

పౌర సేవ ఇంత సులువా ..అన్న రీతిలో వైఎస్సార్‌సీపీ పాలన సాగుతోంది. జగనన్న సురక్ష అనే వినూత్న కార్యక్రమాన్ని సేవా యజ్ఞంగా ఈనెల 1వ తేదీ నుంచి విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు జనన, మరణ, కుల ,ఆదాయ, సీసీ కార్డులు, రేషన్ కార్డు విభజన వంటి 11 రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమం ఎప్పుడూ చూడలేదంటూ సేవలు పొందిన వారంతా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

- జగనన్న సురక్షతో ఇంటి వద్దే ప్రభుత్వ సేవలు
- అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న వైనం
- మండలంలో పూర్తయిన శిబిరాలు
- ప్రజలకు అందిన 12,781 సేవలు

**పెనుగంచిప్రోలు:** ప్రజలకు అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లు, వివిధ ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించటానికి జగనన్న ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండా ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు(కుల, నివాస ధ్రువీకరణపత్రాలు), మ్యూటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్‌కార్డు విభజన, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కౌలు రైతు గుర్తింపు కార్డులు, వివాహ ధ్రువీకరణ పత్రం, ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంతమంది సభ్యుల పేర్లు తొలగింపు వంటి వాటిని అందిస్తున్నారు.

**మండలంలో 12,781 సేవలు**

మండలంలో ఈనెల 4 నుంచి ప్రారంభమైన జగనన్న సురక్ష శిబిరాలు 22 వ తేదీతో ముగిశాయి. మొత్తం 12,780 పౌర సేవలు ప్రజలకు ఉచితంగా అందించారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఈ సేవలు అందించటంతో ప్రజలు ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



నా పేరు నెల్లూరి కోటేశ్వరరావు. మాది మండలంలోని ముండ్లపాడు గ్రామం. నేను కౌలు రైతును. ఎప్పటి నుంచో కౌలు రైతు కార్డు కోసం ఎదురు చూస్తున్నాను. కానీ నిరీక్షణే మిగిలింది. ఇప్పుడా ఆ సమస్య తీరింది. ఈనెల 20న గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో గంటల వ్యవధిలోనే కౌలు రైతు కార్డు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది.



పెనుగంచిప్రోలులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించిన విప్ ఉదయభాను(ఫైల్)

**ప్రజలకు అందిన సేవల వివరాలు ఇలా ఉన్నాయి...**

| | |
|---|---|
| ఆదాయ ధ్రువీకరణ పత్రాలు | 5,811 |
| కుల ధ్రువీకరణ పత్రాలు | 6,347 |
| ఆధార్ కార్డు మొబైల్ నంబర్ అప్‌డేట్ | 412 |
| సీసీఆర్‌సీ కార్డులు | 7 |
| రేషన్ కార్డులో అదనపు సభ్యుల చేర్పు | 56 |
| కొత్త రేషన్ కార్డులు | 11 |
| రేషన్ కార్డులో తొలగింపు సేవలు | 7 |
| జనన ధ్రువీకరణ పత్రం | 1 |
| హౌస్ హోల్డింగ్ మ్యాపింగ్ సేవలు | 15 |
| వివాహ సర్టిఫికెట్లు | 4 |
| ఈసీ | 1 |
| అడంగల్ | 34 |
| ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్లు | 8 |
| ఇళ్ల స్థలాలు | 3 |
| మరణ ధ్రువీకరణ పత్రాలు | 24 |
| ఆర్‌ఓఆర్ సర్టిఫికెట్లు | 37 |
| వ్యవసాయానికి సంబంధించి | 2 |

### పైసా ఖర్చు లేకుండా...



మాది మండలంలోని కొణకంచి గ్రామం. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న ఒక్క రోజులోనే నా చేతికొచ్చాయి. గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఎన్నోమార్లు తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా ఇచ్చారు.

–వేముల తిరుమల, కొణకంచి

### సమస్య పరిష్కరించారు



మాది మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామం. నాకు పెళ్లి అయింది. వేరే చోట ఉంటాం. మా తల్లిదండ్రుల కార్డులో నా పేరు ఉంది. ఆ కార్డులో పేరు తొలగించేందుకు వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. గంటల వ్యవధిలో సమస్య పరిష్కారమయింది.

–పావినేని శామిలి, సుబ్బాయిగూడెం

### సేవల ద్వారా రూ.6,39,450 లబ్ధి



మండలంలో 12,781 సేవలను జగనన్న సురక్ష శిబిరం ద్వారా లబ్ధిదారులకు అందించాం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను వారి ఇళ్ల వద్దకే అందించింది.

–ఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ, పెనుగంచిప్రోలు

## జగన్ పాలనకు జనం జేజేలు

**వత్సవాయి:** కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని ఎంపీపీ కొలుసు నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసుపోగు దేవమణి అన్నారు. గ్రామంలో సోమవారం సర్పంచ్ భూక్యా సీతమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ రాజు, పంచాయతీ కార్యదర్శి షేక్ ఇమామ్‌సాహెబ్, మాజీ సర్పంచ్ గుత్తా శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు భూక్యా రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.



వత్సవాయిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

### పేదలకు దుప్పట్లు పంపిణీ



**జగ్గయ్యపేటఅర్బన్:** ఇటీవల మృతి చెందిన ఆధ్యాత్మిక గురువు, ధర్మ ప్రచారకుడు తట్టా లక్ష్మీనరసింహాచార్యుల కుటుంబ సభ్యులు సోమవారం పేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రామానుజం కీర్తి, రామానుజం వసంత, రంగనాథ్, మాధవి దంపతులు, భగవద్రామానుజ గోష్ఠి ప్రతినిధులు ఆకుల స్వాతికుమార్, విజయ దంపతులు, కేటీ ఆచార్యులు పాల్గొన్నారు.

**నాగమయ్య బజారులో సమస్యల పరిష్కారం**

పట్టణంలోని 22 వ వార్డు నాగమయ్య బజారులో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలు పరిష్కారం అయినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, వక్ఫ్ బోర్డు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జుబేర్ తెలిపారు. నాగమయ్య బజారులో వీధిలైట్ల ఏర్పాటు పనులను సోమవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్యే సామినేని ఉదయభాను వార్డు పర్యటనలో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వార్డులో విద్యుత్ స్తంభాల మరమ్మతులు, వీధి లైట్ల ఏర్పాటు సమస్య పరిష్కరించడంతో పాటు జెడ్పీ బాలికల హైస్కూల్ వెనుక కొన్నేళ్లుగా ఉన్న పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి కూడా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## కవి కోకిల గుర్రం జాషువాకు పలువురి నివాళి

**నందిగామ:** కవి కోకిల, విశ్వకవి చక్రవర్తి గుర్రం జాషువా 52 వ వర్ధంతిని బళ్ళారి రాఘవ కళా సమితి ఆధ్వర్యంలో సోమవారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి, పలువురు అతిథులు జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను కలం ద్వారా చెరిపేసి కులమదాంధకారుల కళ్లు తెరిపించిన మహాకవి గుర్రం జాషువా అని కొనియాడారు. కార్యక్రమంలో సత్యమ్మ తల్లి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం (మామయ్య), పలువురు కళాకారులు పాల్గొన్నారు. దళిత చైతన్య వేదిక, గుర్రం జాషువా కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్ లోని జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్నెగంటి సజ్జనరావు, అద్దంకి మణిబాబు, పెసరమిల్లి శేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.



జాషువా వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ సాయి

## వ్యసనాలకు బానిసలైతే భవిష్యత్తు అంధకారం

**ఏసీపీ జనార్దన్ నాయుడు**

**నందిగామ:** విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఏసీపీ జనార్దన్ నాయుడు సూచించారు. పట్టణంలోని చైతన్య కళాశాల ఆవరణలో సోమవారం సాయంత్రం మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల కలిగే నష్టాల గురించి విద్యార్థులకు తెలియజెప్పేందుకు ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చదువుకోవలసిన వయసులో విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు అండగా నిలవాలన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో సీఐ హనీష్, ఎస్ఐ ఈశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ కార్తీక్ పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ జనార్దన్ నాయుడు

## కొత్త పద్ధతి ప్రకారమే ఆదాయపన్ను గణన

**కంచికచర్ల:** ప్రభుత్వ పెన్షనర్లు డిఫాల్ట్‌గా కొత్త పద్ధతి ప్రకారం ఆదాయపు పన్ను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ సీఎఫ్‌ఎంఎస్‌లకు ఆదేశాలు జారీచేశారని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు తెలిపారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి చెల్లించవలసిన ఆదాయపు పన్ను జూలై నుంచి 2024 ఫిబ్రవరి వరకు సమాన వాయిదాలలో కొత్తపద్ధతిలో రికవరీ చేస్తారన్నారు. పెన్షనర్లు తమ ఆదాయపు పన్ను కొత్త పద్ధతి ప్రకారమే ఆదాయ పన్ను గణన ఉంటుందన్నారు. ఆప్షన్ ఫారాలు సంఘ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి సీహెచ్ నాగేశ్వరరావు, నాయకులు పెద్దినీడి కోటేశ్వరరావు, బీవీ సర్వేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, షేక్ జానిమియా, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

## పశు వ్యాధులతో అప్రమత్తం..లేకుంటే ముప్పే

- వర్షాలకు పశువులకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశం
- రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుబాటులో వైద్యసేవలు

**జగ్గయ్యపేటఅర్బన్:** వర్షాకాలం వచ్చిందంటే జీవాలకు వ్యాధులు సోకే అవకాశాలు ఎక్కువ. పశువులకు సోకే సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా లేకుంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో వచ్చే సాధారణ వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించి వైద్యసిబ్బందిని సంప్రదించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అన్ని రకాల వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది. రైతుభరోసా కేంద్రాల వద్ద పశువైద్య సేవలు అందిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నారు.



పాడి పశువులు

**పశువులకు వచ్చే వ్యాధులు...**

పశువులకు వచ్చే వ్యాధులను 4 రకాలుగా వర్గీకరించారు. అవి
అంటువ్యాధులు, జీర్ణ కోశ వ్యాధులు, గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులు

- అంటు వ్యాధులు

బ్యాక్టీరియల్, వైరల్, ఫంగల్ ద్వారా వచ్చే వ్యాధులు, పరాన్న జీవుల ద్వారా వచ్చే వ్యాధులు
బ్యాక్టీరియల్ వ్యాధులు : గొంతువాపు, జబ్బవాపు, దొమ్మ రోగం, బ్రూసెల్లోసిస్, బొవైను టీబీ, లెప్టోస్పైరోసిస్, ధనుర్వాతం, ఫుట్‌రాట్, చిటుక వ్యాధి

- వైరల్ వ్యాధులు :

ముసర వ్యాధి, గాలికుంటు వ్యాధి, ఎఫిమిరల్ జ్వరం, మశూచి, నీలి నాలుక వ్యాధి, ఐబీఆర్(ఇన్ఫెక్షియస్ బొవైన్ రైనో ట్రైసైటిస్)తదితర వ్యాధులు.

- జీర్ణకోశ వ్యాధులు...

కీటోసిస్, పాలజ్వరం, పడక జబ్బు, ఎసిడోసిస్, ఆల్కలోసిస్, బ్లోట్ జబ్బు, పారుడు జబ్బు

- గర్భకోశ వ్యాధులు...

గర్భవాతం, పయోమెట్రా, సెర్వీసైటిస్, తిరిగి పొర్లడం, అనీస్ట్రం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

**నివారణ చర్యలు...**

పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా సంబంధిత సచివాలయంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను కలిసి వైద్యం అందించాలి. మెరుగైన వైద్యం కోసం వారి సూచనల మేరకు పశువైద్యాధికారిని సంప్రదించాలి.

**పాడి రైతులు పాటించాల్సిన జాగ్రత్తలు...**

- పశువుల శాలల్లో గాలి, వెలుతురు బాగా తగిలేలా చర్యలు తీసుకోవాలి.
- పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి
- పరిశుభ్రమైన నీటిని పశువులకు అందించాలి
- పచ్చిమేతతో పాటు ఎండు గడ్డి కూడా పెట్టాలి
- వ్యాధినిరోధక టీకాలను ఎప్పటికప్పుడు వేయిస్తుండాలి
- ఈగలు, దోమలు పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలి
- పరాన్న జీవుల నివారణ చర్యలు చేపట్టాలి.

**నియోజకవర్గంలో పశుగణన ఇలా...**

| | గేదెలు | ఆవులు | గొర్రెలు | మేకలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| జగ్గయ్యపేట పట్టణం | 1,250 | 250 | 1,875 | 125 | 3,500 |
| జగ్గయ్యపేట మండలం | 1,5871 | 2,454 | 3,3258 | 1,0361 | 43,619 |
| పెనుగంచిప్రోలు మండలం | 12,604 | 1,141 | 12,413 | 4,239 | 30,397 |
| వత్సవాయి మండలం | 10,914 | 1,955 | 23,524 | 6,269 | 29,793 |

### వైద్యుల సూచనలు పాటించాలి



సీజనల్ వ్యాధుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉంటూ పశువైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ల వద్దకు పశువులను తీసుకువెళ్లి వ్యాధి గురించి తెలియజేస్తే వైద్యసేవలు అందిస్తారు. వారి పరిధిలో వ్యాధిని నయం చేయలేని పరిస్థితి ఉంటే రైతులు సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదిస్తే తగు వైద్యం అందిస్తారు.

డాక్టర్ కె.భవానీప్రసాద్, ఏడీ, జగ్గయ్యపేట పశువైద్యశాల

### ● ఆత్మీయ కలయిక



గుంటూరు జిల్లా కృష్ణాయ పాలెంలో సోమవారం జరిగిన పేదలకు ఇళ్ల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే ఉదయభాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆప్యాయంగా పలకరిస్తున్న దృశ్యం

- సాక్షి, ఫొటోగ్రాఫర్, విజయవాడ

### స్పందనకు ఐదు అర్జీలు

**వీరులపాడు:** ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తోందని తహసీల్దార్ ఆశయ్య నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐదు అర్జీలు అందాయన్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

### కంచికచర్లలో స్పందన రద్దు

**కంచికచర్ల:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన రద్దయినట్లు తహసీల్దార్ శంకరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌డీఏ పరిధిలో పేద అక్కచెల్లెమ్మలకు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన నేపథ్యంలో స్పందన కార్యక్రమం రద్దు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.